క్లుప్తంగా

57వ వార్డులో ఫాగింగ్



సుభాష్‌నగర్‌లో ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లో సోమవారం వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి ఆదేశాల మేరకు జీవీఎంసీ జోన్-5 మలేరియా సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ప్రజల వినతి మేరకు గౌరీనగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, భవానీగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు తెలిపారు. దోమల బెడద నుంచి ప్రజలకు విముక్తి కలిగేలా ఫాగింగ్ చేస్తున్నట్లు మలేరియా సిబ్బంది చెప్పారు.

'ఆగమ్ ఐతుంది బా' ఆల్బమ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

మల్కాపురం: ఏఆర్ఆర్ 4 వీ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఆగమ్ ఐతుంది బా' ప్రైవేట్ ఆల్బమ్ పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. మళ్ల నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్ధమాన నటీనటులు సొంతంగా ఆల్బమ్‌ను రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 40,60వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు,పి.వి.సురేష్, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను,పార్టీ నాయకులు ఆడారి శ్రీను,పిన్నింటి అప్పలరాజు,దొడ్డి సతీష్,పూండి మల్లేశ్వరరావు,మళ్ల శివ,లక్ష్మణ్ టేకుమూడి తదితరులు పాల్గొన్నారు.

24 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడ్ని రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నూరుద్దీన్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా హౌరాకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

31న మహిళా న్యాయవాదులకు వర్క్ షాప్

సీతంపేట: మహిళా న్యాయవాదులకు ఈ నెల 31న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పప్పు అనురాధ, పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.ఎస్.భానుమతి, గౌరవ అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. సమావేశంలో కోశాధికారి బి.రమాదేవి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



రాఖీలు కట్టిన మహిళలకు బహుమతులందిస్తున్న దొడ్డి కిరణ్



క్రైం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి రాఖీలు కట్టిన ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సభ్యులు



షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ రామేశ్వరి

రక్షా బంధన్ వేడుక
అనుబంధానికి ప్రతీక

- ఘనంగా రాఖీ పండగ
- పలు చోట్ల వృక్షా బంధనం



అన్నలకు రాఖీ కడుతున్న చెల్లెలు



కొత్తపాలెం ఉన్నత పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న భూషణం మాస్టారు తదితరులు



కంచరపాలెంలో అన్నాతమ్ముళ్లకు రాఖీలు కడుతున్న అక్కాచెల్లెళ్లు



104 ఏరియాలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

గోపాలపట్నం: రాఖీ పండగ ఆనందాల మధ్య సాగింది. మహిళలు ఉదయం సమయాల్లో ఆలయాలకు వెళ్లి అర్చనలు, పూజలు చేశారు. పౌర్ణమి మధ్యాహ్నం తర్వాత రావడంతో సోదరీమణులు తమ అన్నదమ్ముల ఇళ్లకు వెళ్లి రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. వారి ఆశీర్వాదాలు అందుకున్నారు.

- జీవీఎంసీ 89వ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దొడ్డి కిరణ్ నివాసంలో రాఖీ పండగ సందడిగా సాగింది. స్థానిక మహిళలు ఆయనకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు.
- గోపాలపట్నం క్రైంపోలీస్ స్టేషన్‌లో ఈశ్వరీయ బ్రహ్మ కుమారీస్ రాఖీలు కట్టారు. విధుల్లో ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా సాగాలని దీవించారు.
- జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రాఖీ పండగ సందర్భంగా మొక్కలు నాటారు. మానవ మనుగడకు రక్షణగా నిలబడే మొక్కలను రక్షించుకోవడం మన ముందు ఉన్న లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాఖీ పండగ రోజు మొక్కలు నాటామని జేడీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.
- కొత్తపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పర్యావరణ ప్రియుడు, సామాజిక కార్యకర్త భూషణం మాస్టారు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అన్నదమ్ములు మనకు ఎలా రక్షణగా నిలుస్తారో ప్రకృతి మనకు అలాగే రక్షణగా నిలుస్తుందని ఆయన హితవు పలికారు. భవిష్యత్ తరాలు ఆనందంగా ఉండాలంటే అందరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో..

సింధియా: రక్షా బంధన్ పండగ ద్వారా అన్నా చెల్లెళ్ల అనుబంధం మరింత బలపడుతుందని షిప్‌యార్డ్ సీ ఎండీ హేమంత్ ఖత్రి అన్నారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం రక్షా బంధన్ వేడుకలను షిప్‌యార్డ్ సీ ఎండీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బి.కె.రామేశ్వరి రక్షా బంధన్ ద్వారా ప్రేమ, అనురాగం వెల్లువిరుస్తాయన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు సిద్ధు, సునీత, బి.కె.జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: రాఖీ పౌర్ణమి వేడుకలు పారిశ్రామిక ప్రాంతంలో వేడుకగా జరిగాయి. అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెలు దూర ప్రాంతాల నుంచి వచ్చి తమ అనుబంధాన్ని చాటి చెప్పారు. ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం బ్రాంచ్) నిర్వాహకురాలు సింధూ సిస్టర్ సీఐ విద్యాసాగర్‌తో పాటు ఇతర సిబ్బందికి రాఖీలు కట్టారు. అలాగే ముంబయ్‌లో తల్లిదండ్రులతో ఉంటున్న స్వీటీ అనే చిన్నారి తమ్ముడికి రాఖీ కట్టేందుకు వచ్చింది. ఇలా రాఖీ పండగ సందడి కనిపించింది.

చెరిగిపోని బంధం

కంచరపాలెం: అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్ వేడుకలు సోమవారం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. కంచరపాలెం, కప్పరాడ, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం, సంజీవయ్య కాలనీ, బర్మాక్యాంప్, గొల్లకంచరపాలెం, దుర్గానగర్, గౌరీనగర్, సిద్ధార్థనగర్, ఆశవానిపాలెం, బాపూజీ నగర్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అన్నలకు చెల్లెళ్లు, తమ్ములకు అక్కలు ఆత్మీయంగా రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీస్సులు పొందారు. సోదరులు ప్రేమతో వివిధ కానుకలు అందజేశారు. రాఖీ వేడుకలతో వీధులన్నీ కళకళలాడుతూ కనిపించాయి. కంచరపాలెంలోని పలు పాఠశాలల్లో విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు.



సీఐ విద్యాసాగర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సింధూ



కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జెడ్సీ మత్స్యరాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ మత్స్యరాజు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్వో రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అంకురార్పణ



పందిరి రాట వేస్తున్న నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో గురువారం వీఎస్‌టీం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. అసోసియేషన్ చైర్మన్ ఆడారి నాగరాజు, ప్రెసిడెంట్ ఎస్.కె.మీరా, వైస్ ప్రెసిడెంట్ వీ.గణేష్, క్యాషియర్ ఎన్.సోను, సెక్రటరీ బి.దొర సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు. వినాయక చవితి మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీనియర్ నాయకుడు కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు..

శభాష్ యువత



శ్రమదానం ద్వారా చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ప్రకాష్‌నగర్ యువత



శ్రమదానం అనంతరం శుభ్రంగా వినాయక గుడి వెనుక ఖాళీ స్థలం

సింధియా: ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆలోచిస్తూ సమయం వృథా చేయలేదు.. యువత చేయి చేయి కలిపారు. శ్రమదానంతో చుట్టుపక్కల పరిసరాలను శుభ్ర పరుస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు ప్రకాష్‌నగర్ యువకులు. వివరాల్లోకి వెళితే.. జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ కూడలిలోని ఉన్న వినాయక గుడి వెనుక పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.దీంతో యువత సోమవారంస్వయంగా శ్రమదానం చేసి శుభ్రపరిచారు. పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తీసివేయాలని జీవీఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బందికి విన్నవించినా పట్టించుకోక పోవడంతో విసిగిపోయిన యువకులు సోమవారం సుమారు 8 గంటల పాటు కష్టపడి శ్రమదానం చేసి శుభ్రపరిచారు.దీంతో యువతను పలువురు అభినందించారు.

అకాల వర్షం.. చెరువులుగా మారిన రోడ్లు

సేవా మార్గంలో నిలిచిపోయిన వ్యర్థాలు



మల్కాపురం సేవా మార్గంలో నిలిచిపోయిన వర్షపునీరు



రోడ్డుపై నిలిచి పోయిన వ్యర్థాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం కురిసిన అకాల వర్షం కారణంగా పలు సేవా మార్గాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కొన్ని చోట్ల వర్షపు నీటితో పాటు వచ్చిన వ్యర్థాలు నిలిచి పోయాయి.దీంతో దుర్వాసన వెదజల్లింది. మల్కాపురం,ఆర్‌కేపురం,శ్రీహరిపురం వంటి సేవా మార్గాల్లో వర్షపు నీరు నిలిచింది.కాలువలు పొంగి ప్రవహించడంతో వ్యర్థాలు రోడ్లపైకి వచ్చాయి. ఆ సమయంలో ప్రయాణించిన వాహనదారులు,పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు.

జీతాలు చెల్లించాలని ఆందోళన



బకాయి వేతనాలు చెల్లించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: కాంట్రాక్ట్ కార్మికుల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకులు కార్మికులతో కలిసి నినదించారు.హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో జయలక్ష్మి ఇంజినీరింగ్ వర్క్స్ సంస్థలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న 36 మంది కార్మికులకు ఐదు నెలల నుంచి సదరు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని.. ప్రశ్నిస్తున్న కార్మికులకు నోటీసు ఇవ్వకుండా విధుల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. సీఐటీయూ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో కార్మికులు హెచ్‌పీసీఎల్ గేటు వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అలాగే సుమారు పది మంది కార్మికులను విధుల నుంచి తొలగించారని,వారికి ఇంత వరకు కాంట్రాక్టర్ ఫైనల్ సెటిల్‌మెంట్ చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

రోడ్లపైనే చెత్త!







గోపాలపట్నం ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నిర్లక్ష్యంగా వేసిన చెత్త

- డస్ట్ బిన్లు వాడని దుకాణదారులు
- జీవీఎంసీ అధికారులు

గోపాలపట్నం: చెత్త నిర్వహణ కనీస బాధ్యత అన్న విషయాన్ని వ్యాపారులు మరిచిపోతున్నారు. దీంతో రాత్రి 10 గంటలు అయితే రహదారులన్నీ చెత్తమయంగా తయారవుతున్నాయి. ఈ పరిస్థితి 91, 92 వార్డుల్లోని ప్రధాన రహదారుల్లో ఉంది. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు మూసిన తర్వాత చెత్తను డస్ట్‌బిన్లలో వేయకుండా రోడ్లపై నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. ఇదేమని దుకాణదారులను ప్రశ్నించగా నైట్ మాపింగ్ వాళ్లు వచ్చి తుడుస్తారని ధీమాగా చెబుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం

దుకాణాల్లో డస్ట్ బిన్లు వినియోగించడం లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు వచ్చిన చెత్తను రోడ్లపై వేసి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారిపోయింది. చిరుదుకాణాల నుంచి షాపింగ్ మాల్స్ వరకు ఇదే పరిస్థితి అని స్థానికులు చెబుతున్నారు. ఫుట్ పాత్ వ్యాపారులు మరింత దారుణంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. టీ, చిరు దుకాణాల వద్ద తడిచెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త బిన్లు ఉండాలి లేక పోతే అపరాధ రుసుము విధిస్తామని చెబుతున్న అధికారులకు ఇక్కడి పరిస్థితి కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని అందుకే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొందరు బడా వ్యాపారు నుంచి నెలవారీ ఆమ్యామ్యాలు అందుకోవడం వల్లే పట్టించుకోవడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయల్లో కూడా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లపైనే చెత్త వేయడం వల్ల వాహన చోదకులు ఇబ్బందివద్దారు. గాలి వీచినపుడు రోడ్లపై ఉన్న పాలిథిన్ కవర్లు వాహన చోదకుల పైకి రావడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ-భగత్ కి కోటి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: పశ్చిమ మధ్య రైల్వే, జబల్‌పూర్ డివిజన్ కట్నీముర్వ్వా-బినా సెక్షన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్త ఈ మార్గంలో నడిచ విశాఖపట్నం-భగత్‌కికోటి-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. విశాఖపట్నం-భగత్ కి కోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీన, భగత్‌కి కోటి -విశాఖపట్నం (18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31వ తేదీన రద్దు చేయబడింది.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన



వెలవెలబోయిన కేజీహెచ్ ఓపీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో జూనియర్ వైద్యుల ఆందోళన కొనసాగుతోంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి.. కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా.. జూనియర్ వైద్యుల ఆందోళనతో కేజీహెచ్‌కు రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. వచ్చిన రోగులకు వైద్య సేవలందించేందుకు సూపరింటెండెంట్ పి.శివానంద్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. 1,407 మందికి ఓపీ సేవలందించామన్నారు. 26 మేజర్, 9 మైనర్ సర్జరీలు చేసినట్లు తెలిపారు. నిరసనలో జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షురాలు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ప్రజా రవాణాతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం మేయర్ తిరిగి ఆర్టీసీ బస్సులో బంగ్లాకు వెళ్లారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బ్యాటరీ వాహనంలో కార్యాలయానికి చేరుకున్నారు.

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ ప్రశ్నార్థకం

డాబాగార్డెన్స్: యువత భవిష్యత్ ప్రమాదంలో ఉందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అన్నెపు నర్సింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన 'మాదక ద్రవ్యాల వినియోగం- విష సంస్కృతి, ప్రమాదంలో యువత భవిష్యత్' అనే అంశంపై సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు సేవించే వారి కుటుంబ సభ్యుల ఆవేదనను కామేశ్వరరావు తెలియజేశారు. మానసిక వైద్యుడు డాక్టర్ ఎన్.ఎన్.రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను యువత ఏ విధంగా అలవాటు చేసుకుంటున్నారో వివరించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు తదితరులు మాట్లాడారు.